


ఫైల్స్ ముందేసుకూర్చుని ఏవో ఆలోచిస్తున్నదల్లా రజనిగొంతు విని ఉలిక్కిపడింది లలిత.

"అయిపోయిపోయి అయిదు నిమిషా లయిందోయ్! ఇక ఇంటికి పద!" అంది రజని నవ్వుతూ. కాగితాలన్నీ షెల్ఫులోకి సర్దేసి రజనితోబాటు బయటకు నడిచిందామె. ఇద్దరూ బస్‌స్టాప్ చేరుకొని బస్‌కోసం ఎదురు చూడసాగేరు

రజని ఏవో ఆఫీసు గొడవలు మాట్లాడుతోంది.

"ఇప్పుడీ క్రొత్తగావచ్చి నాఫీసరు ఎంత 'డల్'గా ఉంటాడో తెలుసా? ఎక్కడంటే అక్కడ కళ్ళు మూసుకు సంతకం చేసేస్తున్నాడు. ఎప్పుడో, ఎవరో ముంచేస్తారీయన్ని......"

లలితకు ఆ మాటలేమీ మనస్సు కెక్కటంలేదు. ఆ రోజు ఉదయం

ఆలోచనలన్నీ కేంద్రీకృత మయినయి. బహుశా ఆ రోజు, అంతకు ముందు రోజున అతనా గదిలో అద్దెకు దిగి ఉండాలి. సాధారణంగా అందులో కాలేజి కుర్రాళ్ళే ఉంటుంటారు. ఎప్పుడూ తనెవరివంకా చూసిన పాపాన పోలేదు. ఆ అభిప్రాయంకూడాలేదు. కాని ఉదయం ఆఫీసుకు బయల్దేరబోతూ బయటికొచ్చే సరికి అనుకోకుండా ఆ గది కిటికీదగ్గర అతను నుంచుని కనిపించాడు. అతని—విశాలమయిన కళ్ళు—వాటి అందం—తన శరీరాన్నంతా జివ్వున లాగేసినట్లనిపించింది. ఆ కళ్ళల్లో ఆకర్షణ సామాన్యమయింది కాదు ఒకసారి ఆ కళ్ళల్లోకి చూస్తే ఇక జీవితమంతా వేటాడుతూనే ఉంటాయి. అతికష్టంమీద చూపు మరల్చుకొని, అక్కడినుంచి వేగంగా నడిచి బస్‌స్టాప్ చేరుకుంది. భగవంతుడు అందాన్నంతా ఆ రెండు కళ్ళల్లోకి సర్ది అతనికి ప్రసాదించినట్లుంది. జీవితమంతా ఆకళ్ళల్లోకి చూస్తూ గడిపేస్తే ఎంత బావుంటుందో అనిపించింది. కాని తనలాంటి దురదృష్టవంతురాలు కోరుకోవలసిన కోరిక కాదది. కోరికలూ—కలలూ తన తాహతుకి మించినవి. తోటి ఆడపిల్లల్లా తను జీవితంవేపు ఆశగా—ఆసక్తిగా చూడలేదు.

బస్ వచ్చి ఆగింది.

ఇద్దరూ బస్ ఎక్కారు.

ంజని దగ్గరగా వచ్చి నుంచుంటూ అన్నాడొహతను.

"ఇటెక్కడినుంచి ?" చనువుగా అడిగింది రజని.

ఇద్దరూ ఏవో మాటల్లోకి దిగారు.

అతను మొదట్లో రజని ప్రక్కసీట్లోనే పని చేస్తూండేవాడు. అప్పుడే ఇద్దరికీ పరిచయమయి చాలా దూరం వెళ్ళిపోయింది. ఈ మధ్యనే సెంట్రల్ గవర్నమెంటులో మరో ఉద్యోగం దొరికిందతనికి. వెంటనే ఈ ఉద్యోగం వదిలేసి అందులో జాయినయిపోయాడు త్వరలోనే వాళ్ళిద్దరూ వివాహం చేసుకోబోతున్నట్లు చెప్పింది రజని.

"సారీ! నేను కాసేపు అతనితో తిరిగివస్తాను!" మధ్యలో అతనితోపాటు దిగిపోతూ అంది రజని.

బస్ మళ్ళీ బయల్దేరింది.

రజని అదృష్టవంతురాలు. కేవలం సరదాకోసం ఉద్యోగం చేస్తోంది. చేయాల్సిన అవసరం ఏమాత్రం లేదు. పెళ్ళవగానే మానేస్తుందట.


"కాని తను ..." లలితకు కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయి.

ఉద్యోగం తననీ, పిన్నినీ, ఆమె పిల్లల్నీ పోషిస్తోంది. తను లేకపోతే వాళ్ళు లేరు. తనకుమిగలని తల్లిస్థానంలో పిన్నినీ, ఆమె ద్వారా కొంతమంది తమ్ముళ్ళనూ, చెల్లాయిలనూ ప్రవేశపెట్టి, ఓ బాధ్యత అంటగట్టి వెళ్ళిపోయాడు



యు ఎ

నేనేమీ అరవటంలే...!




తండ్రి. అప్పుడు తను యస్సెల్సీ చదువుతోంది. అనాధలయిపోయిన తమ కుటుంబాన్ని చూచి జాలిపడి అదే ఆఫీసులో తనకు ఉద్యోగం ఇచ్చేరు. అయిదేళ్ళు గడిచిపోయింది. జీవితం మిషన్‌లాగా ఒక పద్ధతికి అలవాటు పడిపోయింది. ఉదయం లేవటం, స్నానం వగైరాలు ముగించి భోజనం చేయడం–ఆఫీసుకెళ్ళి సాయంత్రం అయిదింటి వరకూ పనిచేయడం, అప్పుడు ఇల్లు చేరుకోవడం – కాసేపు సన్నజాజిపందిరి దగ్గర కూర్చుని పిల్లలతో కబుర్లు చెప్పటం–భోజనంచేసి నిద్రపోవడం–అంతే! ఒక్క ఆదివారం తప్పితే ఈ కార్యక్రమానికి ఏమీ మార్పుండదు.

చాలాసార్లు తనకి ఆలోచనలు వచ్చినయి.

ఎన్నాళ్ళిలా మోడులా జీవితం గడపటం? యవ్వనం తననీ యిబ్బంది పెడుతోంది. తనకీ వైవాహిక జీవితం కావాలి ముద్దూ, ముచ్చటలు కావాలి. పిన్ని తన విషయం ఆలోచించందే? తనకూ వివాహం చేయాలని అనుకోదేం! వాటన్నిటికీ జవాబులుకూడా తన దగ్గరే ఉన్నయి.

తనకు పెళ్ళయితే పిన్నికి మరో ఆధారం ఉండదు. పిన్నిపిల్లలకు భవిష్యత్తు ఉండదు. అంచేత తనకీ భవిష్యత్తు లేదు. బ్రతుకంతా ఈ ఉద్యోగంచేస్తూ

·నికి త్యాగం పేరుపెట్టుకొని గదిపేయాలి.

బస్ దిగి ఇంటివేపు నడువసాగిందామె.

ఇన్నేళ్ళుగా మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్న వయసునీ, యవ్వనాన్నీ తిరిగి ఆ ఉదయం అతని కళ్ళు మేల్కొలిపినయి. అతని చూపులోని ఆకర్షణ తన మనసులో కోరికలను రాజేసింది. ఆ రోజంతా ఆఫీసులో సరిగ్గా పని చేయనే లేదు.

ఇంట్లోకి నడుస్తూ ఓసారి వెనక్కు తిరిగి ఎదుటి గది వేపు చూసింది లలిత. అతను కిటికీ దగ్గరే నుంచుని తనవంకే చూస్తున్నాడు.

"భగవాన్! ఆ ఆకర్షణనుంచి నన్ను తప్పించు........."

బలవంతంగా చూపు మరల్చుకొని ముందుకి నడిచిందామె. లోపల సువర్చల హిందీ పాట పాడుతూ అద్దంముందు నుంచుని పౌడరు రాసుకొంటోంది.

"నీకోసమే ఎదుర్చూస్తూన్నా నక్కా. ఇవాళ మా ఫ్రెండ్సందరంకలసి సినిమాకి వెళ్తున్నాం. అమ్మని డబ్బులడిగితే—నీకు తెలియందేముందీ? — నీతి పద్యాలు చదువుతోంది. అయిదు రూపాయలుంటే ఇవ్వవే!"

లలితకు నవ్వువచ్చింది. సువర్చలకు సినిమాల పిచ్చి ఎక్కువ. ప్రతి సినిమా చూడాలంటుంది. పిన్ని దానికి డబ్బులివ్వదు. అందుకని ఏదో వొంక చెప్పి తన దగ్గరే తీసుకుపోతుంటుంది.


"నా దగ్గరున్నవే అయిదురూపాయలు! నెల పూర్తవటానికి ఇంకో నాలుగు రోజులు గడవాలి! నాక్కావద్దూ!" అంది లలిత.

"పోనీ లేవే! రెండ్రూపాయలివ్వు చాలు. మా అక్కయ్య బోలెడు మంచిది కదూ!"

నవ్వుతూ సువర్చలకి రెండ్రూపాయలిచ్చింది లలిత. వెంటనే హడావుడిగా ముస్తాబయి బయటకు పరుగెత్తిందామె. ఇది గమనించి సినిమాలు పిల్లల్ని ఎలా పాడుచేస్తయ్యో ఓ లెక్చరిచ్చి వెళ్ళిపోయింది పిన్ని.

"ఇంకోసారి దానికిలా డబ్బివ్వకు!" అని కూడా మందలించింది.

ఆ రాత్రి భోజనం ముగించి పడుకొని ఇంగ్లీష్ నవల చదవడాని కుపక్రమించింది లలిత. ఎంతోసేపు అది చదవబుద్ధి కాలేదు. అతని కళ్ళే తన కళ్ళముందు కనిపించి పిచ్చిదాన్ని చేస్తున్నయి. ఓ వేళ అతను తనను ప్రేమించి పెళ్ళాడటానికి వప్పుకొంటే? నవ్వు వచ్చింది లలితకు. తను గొప్ప అందగత్తె కాదు. కనీసం ఆస్తీ, అంతస్థులు కూడా లేవు. తన నెవరు ప్రేమిస్తారు? ఆ రాత్రి ఆమెకు చాలాసేపటి వరకూ నిద్ర పట్ట లేదు. పట్టిన కొద్దిసేపట్లోనే పీడకలలొచ్చినయి. భయంతో లేచి కూర్చుండి




పోయింది. ప్రక్కమంచంమీద నిద్రలోనే సువర్చల నవ్వుతూ ఏదో అస్పష్టంగా కలువరిస్తోంది. కాసేపాగి మళ్ళీ పడుకొందామె. కాని తర్వాతిక నిద్రపట్టలేదు. అతని రూపమే గుర్తుకి రాసాగింది. మర్నాడు ఆఫీసుకి బయల్దేరుతూ అతని కోసం చూసిందామె. సరిగ్గా అక్కడే, తనకోసమే నుంచున్నట్లు నుంచుని చూస్తున్నాడతను. అదే చూపు—తన శరీరంమీద పూర్తిగా అధికారం పోగొట్టుకొంటోంది తను. అక్కడ నుంచి వడి వడిగా నడిచిందామె. అతను ఎంతో మంచివాడయి ఉండాలి. లేకపోతే తన ప్రవర్తనకి మరో మొగాడయినట్లయితే వెంటబడేవాడు. లేదా ప్రేమలేఖలు వ్రాసేవాడు. ఆ సాయింత్రం ఇంటికి వస్తూంటే చిన్నగా నవ్వాడతను.

లలితకు గాభరా పుట్టుకొచ్చింది. ఒ కుండా తన వ్యవహారం అతనికి విపరీతార్థాలు కలిగిస్తోంది.

నెల రోజులు గడిచినయి. ఈ మధ్య కాలంలో రజని వివాహమయిపోయింది. ఆమె ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసింది. లలిత కూడా కొద్దిగా మారింది. ఆమెకు జీవితంమీద ఓ క్రొత్త రకమయిన రుచి, ఆశలు చిగురించినయి. రోజూ అతను చూసే చూపూ—ప్రోత్సాహకరమైన నవ్వూ—ఆమెకు ఆనందాన్నీ భవిష్యత్తు మీద నమ్మకాన్నీ కలిగించినయి.

ఆ రోజు ఉదయం ఎప్పటిలానే ఆఫీసుకి వెళ్తూ అతనికోసం చూసిందామె. కిటికీ మూసేసి ఉంది. ఆశ్చర్యంగా తలుపుపంక చూసింది. తాళంవేసి ఉంది. దానికి 'టు లెట్' బోర్డు వేలాడుతోంది.



మనసంతా అదోలా అయిపోయిందామెకు. అతనెక్కడికి వెళ్ళిపోయాడూ? ఆఫీసుకి వెళ్ళబుద్ధి కాలేదు. కాని ఆఫీసు మానేసి ఏం చేయాలోకూడా తోచలేదు. మెల్లగా బస్‌స్టాప్ చేరుకొంది.

"నా పేరు శాంత. ఇవాళే టైపిస్టుగా జేరాను!" తన దగ్గర కొస్తూ అందో అమ్మాయి ఆఫీసులో.

"అంటే...రజని స్థలంలో వచ్చారన్నమాట!..."

"అవునండి..."

"గుడ్! రజని మానేసిం దగ్గర్నుంచీ కంపెనీ దొరక్క చచ్చిపోతున్నాను." నవ్వుతూ అంది లలిత.

మధ్యాహ్నం లంచ్‌కి ఇద్దరూ లేడీస్ రూమ్‌కి వెళ్ళారు.

శాంత తన గురించి క్లుప్తంగా చెప్పింది.

"పెళ్ళయిందట. కాని భర్త హింస భరించలేక విడాకులు తీసుకొని ఉద్యోగంలో ప్రవేశించిందట.

"పెళ్ళన్నా, మగాళ్ళన్నా విరక్తి కలిగింది లలితగారూ! నా సిన్సియర్ సలహా ఏమిటంటే మగాడిని బాగా చదవందే పెళ్ళిచేసుకోకండి!" అందామె

సాయింత్రం ఇంటికి వచ్చేటప్పుడు మరోసారి అతని గదివంక చూసిందామె. తాళం అలాగే ఉంది. తను చాలా తెలివి తక్కువగా ప్రవర్తించింది. కొంచెం చొరవచేసి ఉంటే అతను ఎక్కేవాడేమో! అవకాశాన్ని చేజేతులా జారవిడిచి నట్లనిపించిందామెకు.

ఇంట్లోకి వెళ్ళేసరికి లోపల గదిలో నుంచి సన్నగా సువర్చల ఏడుపు వినిపిస్తోంది. పిన్ని ఏడుస్తూ లలిత కెదురు వచ్చింది.

"సువర్చల మన కొంప ముంచిందే తల్లీ! ఇప్పుడేం చెయ్యాలీ? నా కేమీ తోచటం లేదు. ఏ నూతిలోనో పడి ఛస్తాను..."

"ఏమయింది పిన్నీ?" ఖంగారుగా అడిగింది లలిత.

"దౌర్భాగ్యపు పని చేసిందమ్మా. వాడ్నెవడినో నమ్మిందట ...... నెల తప్పింది. వాడు అడ్రసు కూడా చెప్పకుండా పారిపోయాడు..."

"ఎవరతను?" నిర్ఘాంతపోతూ అడిగిందామె.

"మన ఇంటెదురుగా గదిలో ఉండేవాడట... ఎక్కడకు పోయాడో ఇంటివాళ్ళకూ తెలీదట...గది ఖాళీ చేసేశాడు...ఈ పాపిష్ఠి దీసంగతి ఇప్పుడు చెప్తోంది..."

లలితకు కాళ్ళక్రింద భూమి తొలగిపోతున్నట్లనిపించింది. కళ్ళు తిరిగినయి. త్వరగా గదిలోకి నడిచి మంచంమీద కూలబడిపోయింది.

'అతను... అలాంటివాడా? అందమయిన అతని కళ్ళ ఆకర్షణ వెనుక ఇంత కుటిలత్వం — క్రూరత్వం దాగి ఉన్నయ్యా!'

'భగవాన్! ఆ ఆకర్షనుంచి నన్ను రక్షించి నా నాచెల్లాయిని బలి తీసుకొన్నావ్! ఎందుకు స్వామీ!... ఈ కుటుంబమంటే ఎందుకింత కక్ష?'

అప్రయత్నంగా లలిత కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయి. క్రింద కూర్చుని రోదిస్తోన్న సువర్చలని లేవనెత్తి గుండెలకు హత్తుకొంది.

